క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో కొలువుదీరిన కనకమహాలక్ష్మి అమ్మవారికి మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనాలనుకునే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. మరిన్ని వివరాలను ఈ మెయిల్ ఐడీ endow-eokanaka@gov. in ద్వారా తెలుసుకోవచ్చు.

కార్పొరేటర్ సేవానిరతి



అభాగ్యుడిని తన వాహనంపై ఎక్కించుకున్న కార్పొరేటర్ బిపిన్ కుమార్‌జైన్

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 31వ వార్డు కార్పొరేటర్ బిపిన్ కుమార్ జైన్ సేవానిరతిని చాటుకున్నారు. మండుటెండలో కాన్వెంట్ జంక్షన్ వద్ద మాసిన దుస్తులతో, శైలసంస్కారం లేని జుత్తుతో నిరీక్షిస్తున్న ఓ వ్యక్తిని తన బైక్‌పై ఎక్కించుకుని, రైల్వే రిజర్వేషన్ కౌంటర్ వరకు తీసుకెళ్లి ఓ నీడన కూర్చోబెట్టారు. సాధారణంగా అటువంటి పరిస్థితిలో ఉన్న వ్యక్తిని వాహనంపై ఎక్కించుకోరు. కానీ బిపిన్ జైన్ మానవతా దృక్పథంతో సహకరించి, ఆదర్శంగా నిలిచారు.

ప్రమాదకరంగా గొయ్యి



ద్వారకానగర్ మూడో లైన్‌లో ఏర్పడిన గొయ్యి

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు ద్వారకానగర్ మూడో లైన్‌లో పెద్ద గొయ్యి ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళ వాహనచోదకులు ఈ గొయ్యిలో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గొయ్యి పూడ్చివేతకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

'అల్లిపురం భూములపై శాశ్వత హక్కు ఇవ్వాలి'

మహారాణిపేట: అల్లిపురం భూములకు శాశ్వత హక్కులు కల్పించాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ కలెక్టర్‌కు స్పందనలో వినతిపత్రం అందజేశారు. 33వ వార్డు వెంకటేశ్వర మెట్ట అల్లిపురం టౌన్ సర్వే నెంబర్ 1450లో ఉన్న సుమారు 3.82 సెంట్లు భూమిని స్థానిక ప్రజలకు ఇచ్చి, ప్రత్యామ్నాయంగా కొమ్మాదిలో సర్వే నెంబరు 28/2లో సుమారు పది ఎకరాల 18 సెంట్లు భూమిని కేటాయించారన్నారు. కానీ నేటి వరకు దీనిని అమలు చేయలేదని, తక్షణం అమలు చేయాలని కలెక్టర్‌ను కోరారు.

'స్పందన'కు 20 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ ఆనంద్‌కుమార్

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 20 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఆనంద్‌కుమార్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగానికి సీఎం జగన్ పెద్దపీట



35వ వార్డు గణేశ్వర పాఠశాలలో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న విల్లూరి భాస్కరరావు



విద్యార్థులకు విద్యా కానుక కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

- ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్
- 'దక్షిణ'లో జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ

జగదాంబ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగానికి పెద్దపీట వేస్తున్నారని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. సోమవారం జీవీఎంసీ 39వ వార్డులో క్వీన్‌మేరి బాలికల హైస్కూల్‌లో 1000 మంది విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ జిల్లాలో 87,413 మంది విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్‌లు, వర్కుబుక్‌లు, మూడు జతల యూనిఫాం, జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్ట్, బ్యాగ్, ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లిష్–తెలుగు డిక్షనరీలతో కూడిన కిట్లను సమకూర్చారన్నారు. బడులు తెరిచిన రోజే తల్లిదండ్రులకు ఎటువంటి భారం లేకుండా జగనన్న విద్యా కానుక కిట్లను ఉచితంగా అందిస్తున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తూ వారి చదువుల భారాన్ని భుజంపై వేసుకుని జడిబాట, అమ్మఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు.

జగనన్న విద్యా కానుక పంపిణీ

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు గణేశ్వర పాఠశాలలో విద్యార్థులకు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది ఉచితంగా విద్యా కానుక కిట్లు కూడా అందిస్తున్నారన్నారు.

నాణ్యమైన విద్యే జగనన్న లక్ష్యం

అల్లిపురం: విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు నాణ్యమైన విద్యే లక్ష్యమని, అందుకే జగనన్న వారి చదువుల భారాన్ని తన భుజాలకెత్తుకున్నారని 33వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ అన్నారు. పాఠశాలలు పునః ప్రారంభం సందర్భంగా దాబాగార్డెన్స్‌లోని మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలలు తెరిచిన రోజే పది వస్తువులతో కూడిన కిట్ అందజేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్‌వీఎస్ నాగభూషణం, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ రామకృష్ణమాచార్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు నీలాపు అయ్యప్పరెడ్డి, భీశెట్టి రాజు, వార్డు ఎడ్యుకేషనల్ సెక్రటరీ రమేష్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

- మెయిన్ రోడ్డు మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను హెచ్‌ఎం కనకమహాలక్ష్మి, ఉపాధ్యాయులు అందజేశారు.



మహాత్మాగాంధీ హైస్కూల్‌లో జేవీకే కిట్లు అందిస్తున్న గోపీకృష్ణ, హెచ్‌ఎం నాగభూషణం

జేవీకే కిట్లు బాగున్నాయి..



జగనన్న విద్యా కానుక(జేవీకే) కిట్లు బాగున్నాయి. పుస్తకాల నాణ్యత బాగుంది. స్కూల్ బ్యాగ్, షూస్ ఏడాదికి సరిపడా అందజేశారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా, తల్లిదండ్రులకు భారం లేకుండా స్కూల్ ప్రారంభించిన రోజు అందించడం ఆనందంగా ఉంది. జగన్ మావయ్యకు ధన్యవాదాలు.

– ఎం.ఆదిలక్ష్మి, 9వ తరగతి

ఘనంగా కనకమాంబ తొలేళ్ల సంబరం



ఉత్సవ ప్రతిమలను ఊరేగిస్తున్న భక్తులు

సీతంపేట: సీతంపేట గ్రామదేవత కనకమాంబ అమ్మవారి పండగ మహోత్సవంలో భాగంగా సోమవారం సాయంత్రం తొలేళ్ల సంబరం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు శివగణేష్‌శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. త్రిశక్తి ఆలయంలో ముగ్గురమ్మవార్లకు అమృత కుంభాభిషేకం, పంచామృత, కుంకుమ అభిషేకాలు జరిపారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, భక్తులు అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. ఎరుకుమాంబ గుడి నుంచి భక్తులు అమ్మవారి ప్రతిమలు నెత్తిపై పెట్టుకుని సీతంపేట రాధాకృష్ణ ఆలయం వరకు తీసుకొచ్చారు. అక్కడ నుంచి నాయుడు వీధిలోని అమ్మవారి సదరం పట్టుకు తీసుకెళ్లి రాత్రంతా పూజలు చేశారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం అలరించింది.

నేడు ప్రధాన పండగ

కనకమాంబ అమ్మవారి ప్రధాన పండగ మహోత్సవం మంగళవారం వైభవంగా జరిపేందుకు శ్రీకృష్ణ యువజన సేవా సంఘం అన్ని ఏర్పాట్లు చేసింది.

నిరుపయోగంగా మరుగుదొడ్లు



స్టేడియం గోడ వద్ద మరుగుదొడ్లు

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ క్రికెట్ స్టేడియం వద్ద వన్ వే రహదారిలో ప్రజల సౌకర్యార్థం నిర్మించిన మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. మొదట్లో జీవీఎంసీ అధికారులు సక్రమంగా నీటి సరఫరా చేయడంతో వినియోగంలో ఉండేవి. తరువాత కాలక్రమేణా నీరు సరఫరా చేయకపోవడంతో మరుగుదొడ్లు వృథాగా ఉండిపోయాయి. సంబంధిత అధికారులు స్పందించి, నీరు సరఫరా చేసి మరుగుదొడ్లు వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

'ప్రజల ఆకాంక్షకు కేంద్ర ప్రభుత్వం విలువివ్వాలి'

కూర్మన్నపాలెం: రాష్ట్ర ప్రజల ఆకాంక్ష అయిన విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కోరారు. ప్రజల ఆకాంక్షకు కేంద్ర ప్రభుత్వం విలువనిచ్చి విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగించేలా పార్లమెంట్‌లో ప్రకటన చేయాలన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 851వ రోజు, సోమవారం వైఎస్సార్‌టీయూసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విశాఖ ఉక్కును అమ్మాలని ప్రకటించడం కార్మికుల జీవితాలతో ఆడుకోవడమే అన్నారు.

ఇన్ని రోజులుగా కార్మికులు ఉక్కు కర్మాగారం గురించి పోరాడుతున్నా ప్రధాని మోదీ ఈ విషయం ప్రస్తావించకపోవడం సరికాదన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యోగులు, కార్మికులు, మేధావులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని ఉక్కు ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మలచాలని కోరారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

నేడు పునీత అంతోని పండగ

- ఉదయం తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో ప్రత్యేక పూజలు
- సాయంత్రం 5గంటలకు పుర ప్రదక్షిణ
- సాయంత్రం కృతజ్ఞతా బలిపూజ



పునీత అంతోని

దాబాగార్డెన్స్: క్రీస్తు పలుకులను ఆచరణ మార్గంలో పెడుతూ, 106 వసంతాలు పూర్తి చేసుకున్న పునీత అంతోని దేవాలయం ఆధ్యాత్మిక సుగంధాలను జల్లుతోంది. ఒకప్పుడు క్రైస్తవులకు అలంబనగా నిలిచిన ఈ దేవాలయం ఇప్పుడు కులమతాలకు అతీతంగా అందరి హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకుంది. నగరంలోని మహారాణిపేట జగదాంబ జంక్షన్‌కు కూతవేటు దూరంలో 1917లో కేవలం రూ.9వేలతో నిర్మించిన ఈ ప్రార్థనా నిలయం నేడు ఎంతోమందికి ఆపన్నహస్తం అందిస్తోంది. మరెంతో మంది విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణను, ఆధ్యాత్మికతను నేర్పుతోంది.

పునీత అంతోని పేరు ఎలా వచ్చిందంటే..

విశాఖపట్నం ఒకప్పుడు ఐరోపా దేశాల వారికి ఆటపట్టుగా ఉండేది. మనదేశానికి వ్యాపారం కోసం వచ్చిన డచ్, పోర్చుగీసు, ఆంగ్లేయులు అధిక సంఖ్యలో విశాఖలో జీవించేవారు. వారంతా క్రైస్తవులే. దీంతో వారు చర్చి ఏర్పాటు చేసుకోవాలని భావించారు. క్రీ.శ.1852లో రెవ.టిస్సోర్ ప్రకాశరావు పేటలో ఒక చిన్న గృహాన్ని అద్దెకు తీసుకుని దైవ కార్యక్రమాలు ప్రారంభించారు. తర్వాత ఆన్స్లేమ్‌రేయ్ చాపెల్‌లో ప్రార్థనలు చేసేవారు. ఆయన తర్వాత జేబీ గాంటియర్ గుడి బాధ్యతలు తీసుకున్నారు. అప్పటికే భక్తుల సంఖ్య అధికమవడంతో జగదాంబ జంక్షన్లో నూతన దేవాలయ నిర్మాణానికి పూనుకుని, 1917లో పూర్తి చేశారు. అప్పటి బిషప్ రెవ. జీన్ మెరక్లైయర్ ఆ నిర్మాణానికి పునీత అంతోని దేవాలయంగా నామకరణం చేశారు.

1923 నుంచి విద్యాసేవ

ఈ చర్చి దినదినాభివృద్ధి చెందుతూ వచ్చింది. దేవాలయ సేవలు మరింత విస్తృతం చేస్తూ 1923వ సంవత్సరంలో చర్చి ఆవరణలోనే పాఠశాలను నెలకొల్పారు. తర్వాత 10 ఎకరాల విస్తీర్ణంలోని ప్రాంగణంలో ఒకవైపు దేవాలయం, మరో వైపు విద్యాలయం ప్రారంభించారు. అప్పటి మిలిటరీ నాలుగో బెటాలియన్‌కు చెందిన గుర్రాలను అధిక సంఖ్యలో వరుసగా దేవాలయం ముందు ఉంచడంతో ఇది 'లైన్‌గుడి'గా కూడా ప్రసిద్ధి చెందింది. 1934లో ఈ ప్రాంగణంలోకి బిషప్ హౌస్‌ను కూడా తీసుకువచ్చారు. అప్పటి నుంచి ఫాదర్ ఉంటూ పూజలు నిర్వర్తిస్తున్నారు. నగరంలోని చర్చిలకు బిషప్‌గా మల్లవరపు ప్రకాష్ కొనసాగుతున్నారు.

మంగళవారం ప్రత్యేకం

పునీత అంతోని తన విశిష్టమైన సేవలందించి సెయింట్‌గా గుర్తింపు సాధించారు. కొన్ని శతాబ్దాల కిందట ఆయన జూన్ 13వ తేదీ, మంగళవారం దేహం చాలించారు. ఈ నేపథ్యంలో ప్రతీ మంగళవారం నిర్వహించే ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలకు దాదాపు 2 వేల మంది భక్తులు ఈ చర్చికి నేటికీ వస్తుంటారు. దీంతో పాటు ఏటా జూన్ 13వ తేదీన ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ, పునీత అంతోని సేవలను స్మరించుకుంటారు.

నేటి కార్యక్రమాలు

పునీత అంతోని(గుడి పండగ)సేవలను స్మరించుకుంటూ మంగళవారం ఉదయం 7 గంటలకు తెలుగులో, 9 గంటలకు ఇంగ్లిష్‌లో పూజలు చేస్తారు. సాయంత్రం 5 గంటలకు సెయింట్ అంతోని చర్చి నుంచి పుర ప్రదక్షిణ ప్రారంభమై దిబ్బలపాలెం, జగదాంబ జంక్షన్, దండుబజార్ అప్‌రోడ్డు, భుజంగరావుపేట, రామజోగిపేట, అంతోనినగర్, సెయింట్ అంతోని ఉన్నత పాఠశాల మీదుగా తిరిగి చర్చి వరకు సాగనుంది. సాయంత్రం 6 గంటలకు విశాఖ అగ్రపీఠాధిపతి డాక్టర్ మల్లవరపు ప్రకాష్, గుంటూరు జిల్లా యూనివర్సల్ ఇంజినీరింగ్ కాలేజ్ ప్రతినిధి మాలపాటి ఫాతిమా మర్రెడ్డిచే మహోత్సవ కృతజ్ఞతా బలిపూజ నిర్వహించనున్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

భక్తుల సహకారం మరువలేనిది

చర్చి అభివృద్ధిలో భక్తులు అందిస్తున్న సహకారం మరువలేనిది. ఈ దేవాలయం ఇలాంటి ఎన్నో వసంతాలు పూర్తి చేసుకోవాలి. చర్చి ఫాదర్‌గా సేవలందించడం చాలా సంతోషంగా ఉంది. ప్రతి ఒక్కరూ శాంతిని చాటాలి.

– బాలశౌరి, చర్చి విచారణ గురువు, సెయింట్ అంతోని చర్చి

అట్టహాసంగా ఎర్నిమాంబ ఆలయ పునఃప్రారంభం

- ప్రత్యేక పూజలు చేసిన టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి, పశ్చిమ సమన్వయకర్త ఆడారి



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న సుబ్బారెడ్డి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, ఆడారి ఆనంద్‌కుమార్

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం కాన్వెంట్ కూడలిలోని ఎర్నిమాంబ ఆలయ పునః ప్రారంభం సోమవారం అట్టహాసంగా జరిగింది. విశాఖ డెయిరీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ తన సొంత నిధులు రూ. 35లక్షల తో ఆలయ పునర్నిర్మించారు. ఈ సందర్భంగా ఆలయ శిఖరంపై కలశ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు పులఖండం శ్రీకాంత్‌శర్మ, వేదపండితులు గణపతి పూజ, దీక్షాధారణ, వాస్తు యోగిని క్షేత్రపాలక నవగ్రహ సర్వతోభద్ర మండప పూజలు, అధివాసాలు, జలాధివాసం, క్షీరవాసం, ధాన్య, క్షయాధివాసాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ఆలయ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆయనకు ఆలయ కార్యనిర్వహణ అధికారి డి.వెంకట సత్యసురేష్‌బాబా, వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమశ్రీధర్, ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయడం జరిగిందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాజకీయాల్లోకి వచ్చినట్టు ఆయన తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్ కుమార్, అదీప్‌రాజు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బెహరా భాస్కరరావు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



అన్నదానంలో పాల్గొన్న వార్డు కార్పొరేటర్ పూర్ణిమ శ్రీధర్, ఈవో సురేష్‌బాబా

అందరి సహకారంతోనే పర్యావరణ పరిరక్షణ



బస్సులో ప్రయాణిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

దాబాగార్డెన్స్: విశాఖలో పర్యావరణ పరిరక్షణకు అందరి సహకారం అవసరమని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా మేయర్ క్యాంప్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్సులో ప్రయాణించి జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం డయల్ యువర్ మేయర్, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల్లో పాల్గొని తిరిగి బస్సులో క్యాంపు కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ విశాఖ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా, పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ఉద్యోగులు, నగర ప్రజలు, వివిధ వ్యాపార సంస్థలు, విద్యా సంస్థల యాజమాన్యాలు కాలుష్య నియంత్రణకు సహకరించి, వారంలో ఒక రోజు ప్రజారవాణాను ఉపయోగించాలని కోరారు. ప్రతి సోమవారం తనతో పాటు జీవీఎంసీ ఉద్యోగులు ప్రజారవాణా వ్యవస్థను ఉపయోగిస్తున్నారని చెప్పారు.

వడదెబ్బకు గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అల్లిపురం: వడదెబ్బకు గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 10న సరస్వతి పార్కు సమీప కే హోటల్ ఎదురుగా ఉన్న ఫౌంటా ప్లాజా వద్ద ఫుట్‌పాత్‌పై ఎండకు తట్టుకోలేక చెట్టుకింద కూర్చున్నాడు. అలా కూర్చుని అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని 108లో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ వైద్యులు అతనిని పరిశీలించి అప్పటికే చనిపోయినట్లు తెలియజేశారు. దీంతో మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. మృతి చెందిన వ్యక్తి వివరాలు తెలియలేదని పేర్కొన్నారు. మృతుడు సుమారు 40 సంవత్సరాలు వయస్సు కలిగి, 5 అడుగుల 3 అంగులాల ఎత్తుకలిగి, బ్లాక్ కలర్ షార్ట్, తెలుపు రంగు ఫుల్ హ్యాండ్ షర్టు వేసుకుని ఉన్నాడని తెలిపారు. అతని చేతిపై వి.రవిమమా అని పచ్చబొట్టు కూడా ఉందని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు 0891–2783672, 9866111395 ఫోన్ నంబర్లలో తెలియజేయాలని కోరారు.

త్వరితగతిన వినతుల పరిష్కారం



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జోన్–5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: ప్రజల వినతులను త్వరితగతిన పరిష్కరించాలని జీవీఎంసీ జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ ఆదేశించారు. జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి నాలుగు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జెడ్సీ స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. టౌన్ ప్లానింగ్‌కు 02, రెవెన్యూకు 01, యూసీడీ విభాగానికి 01 చొప్పున అర్జీలు అందినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్–1 టీఎస్ఎన్ రాజు, సూపరింటెండెంట్–2 ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ టి.ప్రసన్నరెడ్డి, వాటర్ వర్క్స్ ఈఈ–2 సూరిశెట్టి శేఖర్, డీఈ శ్రీనివాసవర్మ, టౌన్ ప్లానింగ్ టీపీవో శ్రీలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, సూపర్‌వైజర్ జనార్దన్, టీపీఆర్ వో ఏపీడీ కె.శైలజ, సచివాలయ అడ్మిన్లు పాల్గొన్నారు.

మనసుకు ఆనందాన్నిచ్చేది కవిత్వం



సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామితో కవులు, రచయితలు

సీతంపేట: కవిత్వం వింటే మనసుకు ఆనందం కలగాలని లలితా పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి అన్నారు. లలితానగర్ లలితా పీఠం దర్బారు హాల్లో సోమవారం సాయంత్రం కవి సమ్మేళనం జరిగింది. అనంతరం కవులు, రచయితలను ఉద్దేశించి స్వామి వారు అనుగ్రహ భాషణం చేశారు. ఆనందం అంటే మనసు పరవశించే స్థితని పేర్కొన్నారు. అందరి ఆనందాల కంటే బ్రహ్మానందం గొప్పదని, కవిత్వం, సంగీతం, లలిత కళల వల్ల కలిగే ఆనందం ఇంచుమించు బ్రహ్మానందంతో సమానమన్నారు. మనిషి ఎన్ని క్షణాలు ఆనందాన్ని అనుభవించాడో అదే నిజమైన జీవితమని పేర్కొన్నారు. కవి సమ్మేళనంలో చక్కని పద్య, గద్య కవిత్వంతో అలరించారన్నారు. ఆగస్టు 10న లలితా పీఠంలో నన్నయ్య సహస్రాబ్ది ఉత్సవాలు జరుపుకొందామని తెలిపారు. అనంతరం కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులను దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి మహాస్వామిని, రచయితలు, కవులు డి.వి.సూర్యారావు, టి.పి.ఎస్.ఆచార్యులు, శేఖరమంత్రి ప్రభాకర్, చింతా ప్రభాకరరావు, రామతాత, చిన సూర్యనారాయణ, కావ్య, పిళ్లా రమణమూర్తి, కళ్లేపల్లి వరలక్ష్మి, మరడాన సుబ్బారావు, కోరాడ నరసింహారావు, పద్మజ, ఎం.విజయగోపాల్, వేదుల కామేశ్వర శర్మ, గుండాన జోగారావు, సుజాత మూర్తి పాల్గొన్నారు.

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు తదితరులు కార్యక్రమం నిర్వహించారు.

బాల కార్మిక వ్యవస్థపై పోస్టర్ ఆవిష్కరణ

ఎంవీపీకాలనీ: ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ ప్రో చైల్డ్ గ్రూప్, విశాఖ ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ రూపొందించిన పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఎంవీపీ కాలనీ డీఆర్‌డీఏ భవన కార్యాలయంలో విశాఖ జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సాధికారత అధికారి డి.వెంకటేశ్వరి ఈ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల సమష్టి కృషితోనే బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. 18 ఏళ్ల కంటే తక్కువ వయసున్న పిల్లలు పనిచేయకూడదని చట్టంలో ఉందన్నారు. దాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాల్సిన అవసరముందని చెప్పారు. సంస్థల సభ్యులు పాల్గొన్నారు.